క్లుప్తంగా

నేడు కంటి వైద్య శిబిరం

తాడిపత్రి టౌన్: స్థానిక మెయిన్ బజార్‌లోని ఆర్‌వీస్వామి కళ్యాణ మండపంలో శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వాసవీ క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. వాసవీక్లబ్, బెంగళూరు శంకర కంటి వైద్య ఆస్పత్రి, జిల్లా అంధత్వనివారణ సంస్థ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించిన అవసరమైన వారికి ఉచితంగా బెంగళూరులో కంటి ఆపరేషన్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



పోలింగ్ కేంద్రం పరిశీలనకు వెళ్తున్న ఎన్నికల స్పెషాలఫీసర్ పోలా భాస్కర్

తాడిపత్రి టౌన్: స్థానిక సంజీవనగర్‌లో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం ఎన్నికల స్పెషాలఫీసర్ పోలా భాస్కర్ తనిఖీ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వాహణలో భాగంగా పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లపై ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ మునివేలు, మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా, ఎంపీడీఓ రంగారావు, ఈఓఆర్‌డీ జిలాన్ బాషా, సిబ్బంది ఉన్నారు.

చింతలరాయుడిని దర్శించుకున్న ఎన్నికల ప్రత్యేకాధికారి

చింతల వెంకటరమణ స్వామి ఆలయాన్ని శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికల స్పెషాలఫీసర్ పోలా బాస్కర్ సందర్శించారు చింతల వెంకటరమణ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో శిల్ప సంపదను తిలకించారు. అలాగే జిల్లా మెజిస్ట్రేట్ సుజిన్ కుమార్ అమ్మవారు, స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో ఓపెన్ ఇంటర్ కోర్సులు

గుంతకల్లుటౌన్: ఓపెన్ ఇంటర్‌లో చేరేందుకు ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 27వ తేదీలోగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ పొందవచ్చని కళాశాల ప్రిన్సిపల్ ఆర్.సాలాబాయి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ కారణాల చేత ఇంటర్‌ను అర్ధంతరంగా మానేసిన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు కళాశాల ప్రిన్సిపాల్ లేదా కంప్యూటర్ లెక్చరర్ డి.రామచంద్ర (9963603064)ను సంప్రదించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ఇద్దరు పేద మహిళలకు కుట్టుమిషన్ల వితరణ



కుట్టు మిషన్లు అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

తాడిపత్రి టౌన్: స్థానిక రోటరీ క్లబ్ కార్యాలయంలో శుక్రవారం పట్టణానికి చెందిన ఇద్దరు పేద మహిళల జీవనోపాధి కోసం రూ.17 వేలు విలువ చేసే కుట్టు మిషన్లను రోటరీ క్లబ్ సభ్యులు వితరణ చేశారు. పేద మహిళల కుటుంబ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని క్లబ్ సభ్యులు చేయూత నిచ్చినట్లు క్లబ్ అధ్యక్షుడు షాకీర్ తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కిశోర్, సభ్యులు సంజన్న, ఇస్మాయిల్, మద్దిలేటి, రామసుబ్బారెడ్డి, అనిల్, శ్రీకాంత్, కుళ్లాయిస్వామి తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు

గుత్తి: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జి.ఎర్రగుడికి చెందిన శివ అనే యువకుడు శుక్రవారం ప్రమాదవశాత్తు జారి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. శివ ఇంటి ముందు నడుచుకుంటూ వెళుతున్న సమయంలో ఉన్నఫళంగా కాలు జారి కింద పడ్డాడు. చేతులు భూమికి ఆనివ్వడంతో చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చెయ్యికి మూడు కుట్లు వేశారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నేడ గృహసారథుల సమావేశం

తాడిపత్రి టౌన్: స్థానిక పుట్లూరు రోడ్డులోని ఏఎన్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఉదయం 10 గంటలకు నియోజకవర్గంలోని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతోపాటు వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

పామిడి: స్థానిక రహమత్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం ఉదయం 10 గంటలకు గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కే నారాయణరెడ్డి, పట్టణ, రూరల్ సచివాలయ మండల కన్వీనర్లు బీ ఆసిఫ్, ఎం కుమార్‌రెడ్డి తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి హాజరవుతారన్నారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతోపాటు వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

కష్టాలు కడతేరేలా వారధి

- ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో బ్రిడ్జి మంజూరు
- రూ.1.95 కోట్లతో పనుల ప్రారంభం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



చిత్రావతి నదిపై పనులు చేస్తున్న దృశ్యం

యల్లనూరు: ఎన్ని ప్రభుత్వాలు మారినా చిత్రావతి నదిపై రాకపోకలకు ఇబ్బందులు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రజల నుంచి ఒత్తిళ్లు వచ్చినప్పుడు మాత్రం తూతూ మంత్రంగా రోడ్లు వేసి మమ అనిపించేవాళ్లు. దీంతో ప్రజల కష్టాలు యథాతథంగా ఉండేవి. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రజల ఇబ్బందులపై దృష్టి సారించారు. దీనికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి దంపతుల చొరవ తోడవడంతో ప్రజల ఇబ్బందులు తీరుతున్నాయి. ఇందుకు నిదర్శనమే చిత్రావతి నదిపై బ్రిడ్జి నిర్మాణం.

నిత్యం ఇక్కట్లే..

తాడిపతి నుంచి సింహాద్రిపురం వెళ్లడానికి యల్లనూరు, తిరుమలాపురం, పెద్దమల్లేపల్లి, నిట్టూరు మీదుగా రాకపోకలు సాగించాల్సి ఉంది. ఈ దారి లేకుంటే కడప జిల్లాలోని పొట్టిపాడు మీదుగా ఎంకేకాల్వ మీదుగా తాడిపత్రికి రావాల్సి వస్తుంది. దీని వల్ల దాదాపు 15 నుంచి 20 కి.మీ దూరం పెరుగుతుంది. ఇక తిమ్మంపల్లికి కూడా ఇదే దారిగుండా వెళతారు. ఈ దారి గుండా నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయి. దీంతో రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను ఈ దారి గుండానే తరలిస్తారు. అయితే యల్లనూరు వద్ద ప్రవహించే చిత్రావతితో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దశాబ్దాలు గడిచినా దారి కష్టాలు తప్పడం లేదు. గతేడాది డిసెంబర్‌లో పార్నపల్లి రిజర్వాయర్ నుంచి చిత్రావతి నదికి నీరు విడుదల చేయడంతో దాదాపు ఒకటిన్నర నెల రాకపోకలు నిలిచిపోయాయి.

తప్పనున్న దారి ఇబ్బందులు..

యల్లనూరు వద్ద చిత్రావతి నదితో ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి దంపతులు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన సీఎం బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.95 కోట్లు మంజూరు చేశారు. ఈ మేరకు నాలుగు రోజుల క్రితం యల్లనూరు చిత్రావతి నదిపై సిమెంట్ రోడ్డుకు అనుసంధానంగా బ్రిడ్జి పనులు ప్రారంభించారు. చిత్రావతి నదిపై దాదాపు 69 మీట్లరు పొడవు, 7 మీటర్ల వెడల్పుతో బ్రిడ్జిని నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

ఏప్రిల్ ఆఖరుకు పనులు పూర్తి చేస్తాం

యల్లనూరు మండలంలో రోడ్లు, నూతన బ్రిడ్జి పనుల కోసం రూ.కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే పనులను ప్రారంభించాం. ప్రయాణికులకు ఇబ్బందులు కల్గకుండా వేరే మార్గాన్ని ఏర్పాటు చేయించి బ్రిడ్జి పనులను చేస్తున్నాం. యల్లనూరు వద్ద చిత్రావతిపై ఏప్రిల్ నెలాఖరుకు బ్రిడ్జి పనులు పూర్తి చేయిస్తాం. సమస్యలు లేకుండా చూస్తాం. సమస్యగా ఉన్న రోడ్లపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి పెట్టి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తోంది. మంజూరైన వెంటనే రోడ్లు వేసేందుకు చర్యలు తీసుకుంటాం.

\- నరసింహమూర్తి, ఆర్‌అండ్‌బీ ఏఈ

బ్రిడ్జి నిర్మాణం సంతోషకరం



మా గ్రామం నుంచి ఏ పనికైనా నిత్యం ఈ బ్రిడ్జిపై రాకపోకలు సాగిస్తుంటాం. పశుగ్రాసం, ఎరువులు, పురుగుల మందులకు రోజూ యల్లనూరు వరకు వెళ్తుంటాం. వర్షాకాలంలో చిత్రావతి ప్రవాహంతో రాకపోకలకు ఇబ్బందులు కలిగేవి. ఈ బ్రిడ్జి నిర్మించడం మాకు సంతోషంగా ఉంది. మేము ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నా.

\- పెద్దిరాజు, పెద్దమల్లేపల్లి

దీర్ఘకాలిక సమస్య పరిష్కారం



యల్లనూరు చిత్రావతి నదిలో బ్రిడ్జి ఏర్పాటు చేయండం చాలా ఆనందంగా ఉంది. గతంలో ఈ రోడ్డు మీద ప్రయాణాలు చేయలంటే ఇబ్బందులు పడేవాళ్లం. ప్రస్తుతం నూతన బ్రిడ్జి నిర్మాణం చేస్తే ప్రయాణాలు చేసుకోవచ్చు. గతంలో చిత్రావతి నదికి నీరు విడుదలైతే రోడ్డు దాటలేని పరిస్థితి ఉండేది. బ్రిడ్జి నిర్మాణంతో దీర్ఘకాలిక సమస్య పరిష్కారమవుతుంది.

\- కమలాకర్‌రెడ్డి, యల్లనూరు

బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ



రవిరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి

పామిడి: ఎద్దులపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత నీలం అశ్వర్థరెడ్డి కుమారుడు నీలం రవిరెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి ఎద్దులపల్లిలోని నీలం అశ్వర్థరెడ్డి ఇంటికి వెళ్లి రవిరెడ్డిని పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ జానకిరామిరెడ్డి, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కలూరు దిలీప్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, నరసింహ, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

కార్మిక సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లుటౌన్: ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీపీటీడీ ఎస్‌ఎంయూ డిపో అధ్యక్షుడు ఏఎల్ఎన్.గౌడ్, కార్యదర్శి నటరాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎన్ఎంయూ నాయకులు డిపో హెడ్‌క్లర్క్ వైసీ.మోహన్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్యారేజీలో పనిచేసే కార్మికులను డీఎం నారాయణ స్వామి నానా దుర్భాషలాడుతూ వారిని మానసికవేదనకు గురిచేస్తున్నారన్నారు. డీఎం వైఖరిపై గతంలో అనేకమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఆయనలో ఎటువంటి మార్పులేదన్నారు. డ్రైవర్, కండక్టర్లకు సంబంధించి నూతన డ్యూటీ చార్ట్‌లను అమలు చేయాలని, బస్సుల రిపేరీకి అవసరమైన అన్ని రకాల సామగ్రిని తెప్పించాలని, గ్యారేజీ కార్మికుల పట్ల డీఎం వేధింపులను ఆపకపోతే దశలవారీగా ఉద్యమాలు చేపడుతామన్నారు.

1 నుంచి గాలికుంటు టీకా

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా ఆవులు, ఎద్దులు, గేదేలు, దూడలకు మార్చి 1 నుంచి గాలికుంటు వ్యాధి నివారణ కోసం టీకా వేయనున్నట్లు పశువైద్యాధికారి రమేష్ తెలిపారు.శుక్రవారం ఆయన మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. పశువుల్లో గాలికుంటు వ్యాధి రాకుండా ముందు జాగ్రత్తగా ప్రతి ఆరు నెలలకోసారి ప్రభుత్వం ఉచితంగా టీకాలు వేస్తోందన్నారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో ఉన్న దాదాపు 15,500 పశువులకు పశువైద్య సిబ్బంది నెల రోజుల పాటు టీకాలు వేస్తామన్నారు. మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మండలాన్ని అభివృద్ధి పథంలో నడుపుదాం



మాట్లాడుతున్న ఎంపీపీ గంగాదేవి

యల్లనూరు: ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి మండలాన్ని అభివృద్ధి బాటలో నడుపుదామని ఎంపీపీ గంగాదేవి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చూడాలని అధికారులకు తెలియజేశారు. అనంతరం విద్య, వ్యవసాయం, గృహనిర్మాణం, పోలీసు, రెవెన్యూ, వైద్యం, అంగన్‌వాడీ, పంచాయతీ రాజ్ తదితర అధికారులు వారి శాఖల ప్రగతిని చదివి వినిపించారు. పౌష్టికాహార లోపంతో చాలామంది బాలలు బాధపడుతున్నారని వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సూచించారు. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో 305మంది విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశామని ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు. వ్యవసాయ సబ్సిడీ పరికరాలను కావాల్సిన రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని ఏఓ రామకృష్ణ కోరారు. జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్ త్వరలోనే అందిస్తామని గ్రామీణ నీటి సరఫరా శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ నాయుడు తెలియజేశారు. అచ్యుతాపురం అంగన్‌వాడీ భవనం నిర్మించి చాలారోజులు కావస్తున్నా ఇప్పటి వరకు భవనాన్ని స్వాధీనం చేయలేదని సూపర్‌వైజర్ లక్ష్మీదేవి తెలిపారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కొండన్న, ఎంపీటీసీ సభ్యులు తిమోతి, ఆదినారాయణరెడ్డి, రమాదేవి, యల్లప్పనాయుడు, కూచివారిపల్లి సర్పంచి నారాయణస్వామి, వైద్యులు శివసాయి, పీఆర్ ఇంజనీరు నరేంద్ర,సీనియర్ అసిస్టెంటు వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం



రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ రాష్ట్ర నేత ఓబులు

శింగనమల: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని సీఐటీయూ రాష్ట్ర నేత ఓబులు అన్నారు. శుక్రవారం శింగనమల తహసీల్దార్ కార్యాలయం ముందు సీపీఎం, సీఐటీయూ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అదానికి కొమ్ముకాస్తోందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికీ భారీ కోతలు విధించిందన్నారు.కర్ణాటకలో అప్పర్ భద్రకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించడం ద్వారా ఏపీ, కర్ణాటకల మధ్య విద్వేషాలు పెంచి పోషిస్తోందన్నారు. అనంతరం రెవెన్యూధికారులకు వినతి పత్రం అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి భాస్కర్, నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, ఆంజనేయులు, తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి మోడీ సర్కారు మొండిచేయి చూపిందని సీపీఎం పట్టణ కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసులు విమర్శించారు. కేంద్రబడ్జెట్‌లో ఏపీకి జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా శుక్రవారం సీపీఎం నాయకులు పొట్టిశ్రీరాములు సర్కిల్‌లో నిరసన తెలిపారు. సంక్షేమ పథకాలు, సబ్సిడీలపై కోతలు విధించిన కేంద్రం పేదలపై అదనపు భారాలు మోపిందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వరంగ సంస్థలను కేంద్రం నిర్వీర్యం చేసిందన్నారు. అదానీ లాంటి అక్రమార్కులకు కేంద్రం కొమ్ముకాస్తోందని ఆయన నిప్పులు చెరిగారు. ఏపీ అభివృద్ధికి ప్రత్యేక హోదా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు డి.శ్రీనివాసులు, మారుతి, దాసరిసీనా, సాకేనాగరాజు, రమేష్, రామునాయక్, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని విద్యార్థినికి గాయాలు



విద్యార్థినిని 108లో తరలిస్తున్న దృశ్యం

యాడికి: కారు ఢీ కొని విద్యార్థికి తీవ్ర గాయాలైన సంఘటన పెద్దపప్పూరు మండలం ముచ్చుకోటలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న ఆయేషా అనే విద్యార్థిని బడి వదిలిన తర్వాత ఇంటికి బయలుదేరింది. తాడిపత్రి నుంచి అనంతపురం వెళుతున్న కారు చిన్నారిని ఢీకొంది. ఘటనలో చిన్నారి తలకు గాయాలుకావడంతో స్థానికులు 108 వాహనంలో తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఘనంగా ఉపవాస ఆరాధన

పామిడి: స్థానిక సీఎస్ఐ చర్చిలో శుక్రవారం క్రీస్తు శ్రమల దినాల స్మరణలో భాగంగా శుక్రవార సాయంకాలపు ఉపవాస ఆరాధన ఘనంగా నిర్వహించారు. దైవ సేవకుడు బ్రదర్ బాబావలి క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. దేవుని రాజ్యం, సువార్తను ప్రకటించక ముందు 40 రోజుల పాటు కఠోర ఉపవాస దినాలను ఆచరిస్తూనే శోధకుడైన సాతానును జయించారన్నారు. ఇలా క్రీస్తు శ్రమలదినాల్లో భాగంగా ఆయన సిలువలో పడిన బాధలను స్మరించుకుంటూ భస్మ బుధవారం నుంచి గుడ్ ఫ్రైడే, శనివారం వరకూ క్రైస్తవులు 40 రోజుల ఉపవాసదినాలు ఆచరిస్తానన్నారు. ఈ దినాల్లో క్రైస్తవులు ప్రార్థనలు, విశ్వాసంతో దేవుడిని ఆరాధిస్తారన్నారు. చర్చి సెక్రటరీ పరదేశి విజయశేఖర్‌రాజు, సభ్యులు, వీరయ్య, జయరాజు, జకరయ్య, అబ్రహం, బుజ్జిబాబు, విజయభాస్కర్, ప్రసాద్, రజని, మేరి, ప్రిస్కిల్లా, ప్రశాంతి, లత తదితరులు పాల్గొన్నారు.

కంచె ఏర్పాటును అడ్డుకోవడంపై ఫిర్యాదు

బుక్కరాయసముద్రం: కొర్రపాడు గ్రామంలో తమ పొలానికి కంచె వేస్తుంటే కొందరు కావాలనే అడ్డుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ నేత చంద్రశేఖర్‌రెడ్డి, ఆయన కుమారుడు రెడ్డప్పరెడ్డి తెలిపారు. గ్రామంలో తమకు 12.77 ఎకరాల పొలం ఉందని, అందులో అరటి సాగు చేస్తున్నామన్నారు. ఈ పొలం పక్కనే ఉన్న కొందరు తమ పొలానికి కంచె వేస్తుంటే అనవసరంగా గొడవకు దిగుతున్నారన్నారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం

బుక్కరాయసముద్రం: పిల్లలకు చదువులతో పాటు ఆరోగ్య పరిరక్షణపై జాగ్రత్తలు ఎంతో అవసరమని మండల వైద్యాధికారిణి డాక్టర్ స్వాతిలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్డీటీ బధిరుల పాఠశాలలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వాతిలక్ష్మి మాట్లాడుతూ ఇటీవల ఆర్డీటీ పిల్లలు క్రీడా పోటీల కోసం మధ్యప్రదేశ్‌కు వెళ్లడంతో అనారోగ్యానికి గురయ్యారన్నారు. సమస్య ఉన్నవారిక పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. సీహెచ్ఓ మోహన్‌రావు, పీహెచ్ఎన్ చెన్నమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎర్రిస్వామి, సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, హెల్త్ అసిస్టెంట్ ధనుంజయ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తా



ఎమ్మెల్యే పద్మావతి, సాంబశివారెడ్డిని కలిసిన ఈశ్వరరెడ్డి

యల్లనూరు: వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా ఈశ్వర్‌రెడ్డి ఇటీవల నియమతులయ్యారు. శుక్రవారం ఆయన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే దంపతులకు కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లాలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. మరోసారి జగనన్న సీఎం అయ్యేందుకు సమష్టిగా కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో కొత్తపల్లి పురుషోత్తంనాయుడు, దంతలపల్లి బాల వెంకటరెడ్డి ఉన్నారు.

శింగనమల: వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన బోయ ఎన్‌వీ నారాయణ శుక్రవారం ప్రభుత్వ విద్యా సలహాదారులు ఆలూరు సాంబశివారెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. రైతు విభాగంలో బాగా పని చేసి పార్టీతోపాటు నియోజకవర్గానికి పేరు తీసుకురావాలని ఆలూరు సాంబశివారెడ్డి నారయణకు సూచించారు. డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నగేష్, చెన్నకేశవులు, నాయకులు కల్లుమడి కొండయ్య, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నూతనోత్సాహంతో ప్రజా సంక్షేమయాత్ర



ప్రజాసంక్షేమ యాత్ర పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి (ఫైల్)

- 28 నుంచి పెద్దపప్పూరు మండలంలో ప్రారంభం
- 11 రోజులపాటు 100 కిలోమీటర్లు
- ముచ్చుకోట నుంచి యాత్ర మొదలు

తాడిపత్రి: అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉంటూ, నిత్యం ప్రజలతో మమేకమై వారి సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి రెండో విడత ప్రజా సంక్షేమ యాత్రకు శ్రీకారం చుట్టారు. ఇటీవల పెద్దవడుగూరు మండలంలో 11 రోజుల పాటు చేపట్టిన ప్రజా సంక్షేమ యాత్ర ద్వారా అన్ని గ్రామాల్లో పాదయాత్ర చేపట్టిన ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి జేసీ సోదరుల పాలనలో జరగని అభివృద్ధిని తాను ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం మండలంలో చేసిన అభివృద్ధి పనులను వివరించారు. వాస్తవాలను తెలుసుకున్న ప్రజలు ఆయన పాదయాత్రకు బ్రహ్మరథం పట్టారు. దీంతో ఎమ్మెల్యే రెట్టించిన ఉత్సాహంతో నియోజకవర్గంలోని పెద్దపప్పూరు మండలంలో ప్రజా సంక్షేమ యాత్రకు సిద్ధమయ్యారు. ఈనెల 28న ముచ్చుకోటలో ప్రారంభయ్యే పాదయాత్ర వచ్చే నెల10 పెద్దపప్పూరులో జరిగే బహిరంగ సభతో ముగియనుంది.

వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో జోష్..

ఇటీవల ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేపట్టిన ప్రజా సంక్షేమ యాత్రతో మండలంలోని అన్ని గ్రామాలతో పాటు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు జోష్‌లో ఉన్నాయి. పాదయాత్ర సమయంలో కొన్ని గ్రామాల్లో పలువురు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీ కండువాను కప్పుకున్నారు. అంతేకాక ప్రస్తుతం చేపట్టే పాదయాత్ర ద్వారా మండలంలో నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నుంచి వలసలు ఉంటాయని భావిస్తున్నారు. పాదయాత్ర ద్వారా అటు పార్టీకీ ఇటు ఎమ్మెల్యేకు ఆదరణ రెట్టింపు అవుతుందన్న ధీమాలో మండలంలోని నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రజా సంక్షేమ యాత్ర సాగేదిలా..

తేదీ	గ్రామాలు
28	ముచ్చుకోట- వరదాయపల్లి- అమ్మళ్లదిన్నె- కొత్తపల్లి.
1	కొత్తపల్లి- నారాపురం-సోమనపల్లి- తిమ్మనచెరువు -జూటూరు
2	జూటూరు-వేగంపేట-నరసాపురం-పెండేకల్లు
3	పెండేకల్లు-కుమ్మెత్త-సుంకేసులపల్లి-అత్తిరాళ్లదిన్నె - కొట్టాలపల్లి
4	కొట్టాలపల్లి-కమ్మవారిపల్లి-పసలూరు-గార్లదిన్నె-బొందలదిన్నె
5	బొందలదిన్నె-పెద్ద ఎక్కలూరు- కొండాపురం-చెర్లోపల్లి
6	చెర్లోపల్లి-తురకపల్లి-తాండా-దేవుని ఉప్పలపాడు
7	దేవుని ఉప్పలపాడు-రెడ్డిపల్లి-చిన్న ఎక్కలూరు -తాగలూరు
8	తాగలూరు-తబ్జుల-శింగనగుట్టపల్లి
9	శింగనగుట్టపల్లి-చిక్కేపల్లి-నామనాంకపల్లి-షేక్‌పల్లి-ధర్మాపురం
10	ధర్మాపురం-చింతలపల్లి-చిన్నపప్పూరు-పెద్దపప్పూరు

ఉద్యాన పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



ఫ్రూట్ ప్రాసెసింగ్ భవనాన్ని పరిశీలిస్తున్న డీడీ బీవీ సుబ్బారావు

శింగనమల: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) బీవీ సుబ్బారావు సూచించారు. శుక్రవారం శింగనమలలో ఏపీ సమీకృత సాగునీరు పథకంలో భాగంగా రైతులతో సమావేశం నిర్వహించారు. డీడీ మాట్లాడుతూ రైతులు డ్రిప్ ఇరిగేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అగ్రికల్చర్ బిజినెస్ ఎక్సపర్ట్ మస్తాన్‌రావు మాట్లాడుతూ రైతులు తమ పంటలను అధిక ధరలకు ఎలా విక్రయించాలో వివరించారు. శింగనమల చెరువు కింద పంట మార్పిడి పద్ధతి అవలంభించాలని సూచించారు. అనంతరం ఫ్రూట్ ప్రాసెసింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఇరిగేషన్ ఏఈ రాంభూపాల్‌రెడ్డి, హెచ్ఓ శైలజ, సర్పంచ్ నాగమునెమ్మ, ఏఈఓ అక్కమ్మ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

పామిడి: ఎద్దులపల్లిరోడ్డులోని రహమత్ ఫంక్షన్‌హాల్ సమీపాన పేకాట ఆడుతున్న 15 మందిని శుక్రవారం రాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ షేక్ చాంద్‌బాషా, పోలీసులు పేకాట శిబిరంపై ఆకస్మికంగా దాడిచేసి వారిని అదుపులోనికి తీసుకున్నారు. వారి నుంచి రూ.35,770 స్వాధీనం చేసుకున్నారు.

పింఛన్ల పంపిణీపై తనిఖీ

యాడికి: వలంటీర్లు పింఛన్లను సకాలంలో అందిస్తున్నారా లేదా అని లబ్ధిదారులను పింఛన్ల తనిఖీ అధికారి బసవరాజు ఆరా తీశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆసుపత్రి కాలనీలో పింఛన్ల పంపిణీపై బసవరాజు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 14 పంచాయతీల్లో ఈ నెల 23 నుంచి మార్చి 4 వరకు పింఛన్లపై సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నామన్నారు. చేనేత, ఒంటరి మహిళ, వృద్ధాప్య ఫించన్ లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అర్హత గల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి వివరాలు సేకరించామన్నారు.